మధ్యవర్తిత్వం పాశుపతాస్త్రం

ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి • భార్యాభర్తల వివాదాలూ పరిష్కరించుకోవచ్చు • ఐఏఎంసీ ఏర్పాటుకు మాజీ సీఎం కేసీఆర్ ప్రోత్సాహం

ఐఏఎంసీలో కామన్‌వెల్త్ మెడ్–ఆర్బ్ కాన్ఫరెన్స్–2024 సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో జస్టిస్ ఎన్వీ రమణ

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): మధ్యవర్తిత్వ విధానాన్ని ప్రజలకు చేరువ చేయాలని, న్యాయ పరంగా ఇదొక పాశుపతాస్త్రం లాంటిదనే అంశంపై విస్తృత స్థాయిలో జనబాహుళ్యంలోకి తీసుకువెళ్లాలని సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. మీడియేషన్–ఆర్బిట్రేషన్లను ప్రజాక్షేత్రంలోకి తీసుకువెళ్లాలని సూచించారు. మీడియేషన్, ఆర్బిట్రేషన్లను కక్షిదారులే కాకుండా న్యాయవాదులు, వ్యాపార, వాణిజ్య, ఐటీ సంస్థలు, భార్యాభర్తల వివాదాలు కూడా పరిష్కరించుకునేందుకు వీలున్నదని చెప్పారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అత్యాధునిక వసతులతో సింగపూర్, దుబాయ్, పారిస్, ఇంగ్లాండ్ తదితర అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రాలకు దీటుగా ఏర్పాటైన ఐఏఎంసీలో కామన్‌వెల్త్ మెడ్–ఆర్బ్ కాన్ఫరెన్స్–2024 సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. అంతర్జాతీయ మీడియేషన్–ఆర్బిట్రేషన్ సెంటర్లకు మంచి ఆదరణ ఉన్నట్టుగానే ఐఏఎంసీని కూడా వినియోగంలోకి తేవాలని అభిలషించారు. అంతర్జాతీయ సంస్థలు, అదే స్థాయిలోని పరిశ్రమలు, వాణిజ్య సంస్థలే తమ కేసులను సత్వరమే పరిష్కరించుకునే అవకాశం ఉందనేది అపోహ మాత్రమేనని అన్నారు. భార్యాభర్తల తగవుల నుంచి చిన్నపాటి వ్యాపారుల మధ్య నెలకొనే వివాదాలు కూడా పరిష్కరించుకునే వీలున్నదని వివరించారు. పైసా ఖర్చు లేకుండా ఇరుపక్షాలు తమ వివాదాన్ని పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. మన దేశంలో ఆర్బిట్రేషన్–మీడియేషన్ సెంటర్ అంటే ఢిల్లీ లేదా ముంబై అనే అపోహ నుంచి బయట పడాలని పేర్కొన్నారు. హైదరాబాద్ ఐఏఎంసీ విషయంలో నీరుగార్చే ప్రయత్నాలు చేస్తే ఆదిలోనే అడ్డుకోవాలని చెప్పారు.

తక్కువ వ్యయంతో శిక్షణ

తక్కువ వ్యయంతో శిక్షణ ఇచ్చే సౌకర్యం హైదరాబాద్ ఐఏఎంసీలో ఉన్నదని జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కొందరు వ్యక్తులు ఈ తరహా శిక్షలు ఇచ్చి ఐదారు లక్షల రూపాయలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్రిడేటెడ్ గుర్తుంపు కూడా ఉన్న ఐఏఎంసీలో శిక్షణ పొందితే రూ.50 వేలు మాత్రమే ఖర్చు అవుతుందని వివరించారు.

పీవీ నర్సింహారావు ప్రధాని అయ్యాక చేపట్టిన సరళీకృత ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టినప్పుడు పలు అంతర్జాతీయ వేదికలపై న్యాయ పరమైన కేసులు ఏండ్ల తరబడి మన దేశంలో పరిష్కారం కావనే విమర్శలు బాగా వచ్చాయని గుర్తుచేశారు. దీంతో నాటి కేంద్ర న్యాయ శాఖ కార్యదర్శి పీసీరావును ప్రధాని పీవీ ఆదేశించిన ఫలితంగానే 1996లో ఆర్బిట్రేషన్ యాక్ట్ వచ్చిందని వివరించారు. ఏపీలోని అనకాపల్లిలో బెల్లం వ్యాపారులకు–రైతులకు మధ్య ఏదైనా వివాదం తలెత్తితే.. వాటిని అక్కడి ఇరుపక్షాల పెద్దలే రాజీ ద్వారా పరిష్కరించుకుంటారని, ఒక్కటి కూడా కోర్టులో కేసు దాఖలు కాలేదని చెప్పారు. మధ్యవర్తిత్వ విధానం బలంగా నాటుకుపోయిందని, నిజానికి మధ్యవర్తిత్వ విధానం భారతీయ జీవనంలోనే ఉన్నదని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టాక దేశంలోనే అత్యంత ప్రాధాన్యం ఉన్న హైదరాబాద్‌లో ఒక ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలనే తలంపు వచ్చిందే తడవుగా కార్యరూపంలో పెట్టేందుకు నాటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ యుద్ధప్రాతిపదికపై చర్యలు తీసుకున్నారని కొనియాడారు. భూమి ఇవ్వడమే కాకుండా తాత్కాలిక కార్యాలయ ఏర్పాట్లు చేశారని గుర్తుచేసుకున్నారు. ఐఏఎంసీని ప్రజలు, న్యాయవాదులు, ఐటీసంస్థలు, పరిశ్రమలు, చిన్నపాటి వ్యాపారులు సైతం సద్వినియోగం చేసుకుంటేనే అంతర్జాతీయ స్థాయిలోని ఆర్బిట్రేషన్ సెంటర్లకు దీటుగా నిలబడతామని చెప్పారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

- శివలింగం మాయంపై బసవన్న ఆలయం వద్ద హిందూ సంఘాల ధర్నా

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 22 : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీలోని జానంపేట వికానందకాలనీ అతి పురాతన బసవన్న ఆలయం ముందున్న శివలింగాన్ని గుర్తు తెలియని దుండగులు మాయం చేశారు. అర్చకులు శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చేసరికి ఆలయం ముందున్న శివలింగాన్ని తొలగించినట్టు కనిపించడంతో స్థానికులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. శివలింగాన్ని తొలగించడంతోపాటు వినాయక విగ్రహాన్ని ఆలయ సమీపంలో పడవేయడంపై హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆలయం వద్ద ధర్నా చేపట్టారు. సంఘటనా స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్ నర్సింహ, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బస్వం, హిందూ సంఘాల నాయకులు పరిశీలించారు. శివలింగాన్ని తొలగించిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బసవన్న ఆలయంలో ఇదివరకే నూతన శివలింగాన్ని ప్రతిష్ఠించగా.. ఆలయం ముందు భిన్నంగా ఉన్న శివలింగాన్ని గుర్తు తెలియని దుండగులు తొలగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హనుమాన్ ఆలయంలో మంటలు

మహదేవపూర్, నవంబర్ 22: భూపాలపల్లి మండలంలోని అంబట్‌పల్లి అమరేశ్వర ఆలయ ఆవరణలో ఉన్న హనుమాన్ ఆలయంలో గురువారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆలయ చైర్మన్ సూర్యనారాయణ తెలిపారు. హనుమాన్ పాదాల వద్ద పెట్టిన కుడుకలోని దీపం అంటుకొని విగ్రహానికి గల చందనం, నూనె వల్ల మంటలు వ్యాప్తి చెందాయని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు.

హైడ్రాకు ఏడుగురు ఎస్‌ఎఫ్‌వోలు

- ఉత్తర్వులు జారీ చేసిన డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)కి అగ్నిమాపకశాఖలోని స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు(ఎస్‌ఎఫ్‌వోలు) బదిలీ అయ్యారు. ఈ మేరకు అగ్నిమాపక శాఖ డీజీ వై నాగిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే హైదరాబాద్‌లోని హైడ్రా కార్యాలయంలో రిపోర్టుచేయాలని ఆదేశించారు. హన్మకొండ ఎస్‌ఎఫ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, కోదాడ ఎస్‌ఎఫ్‌వో సీహెచ్ శ్రీనివాస్, సికింద్రాబాద్ ఎస్‌ఎఫ్‌వో సుభాష్‌రెడ్డి, ముషీరాబాద్ ఎస్‌ఎఫ్‌వో బీ సుధాకర్, గౌలిగూడ ఎస్‌ఎఫ్‌వో ఎన్ ప్రవీణ్‌కుమార్, లంగర్‌హౌస్ ఎస్‌ఎఫ్‌వో పీ దత్తు, వనపర్తి ఎస్‌ఎఫ్‌వో ఎస్ పద్మయ్య బదిలీ అయిన వారిలో ఉన్నారు.

వాంకిడి విద్యార్థిని ఆరోగ్యం విషమం

> మొదటిపేజీ తరువాయి...

నవంబర్ 3న ఫుడ్ పాయిజన్ అయింది. పాఠశాలలో భోజనం చేసిన విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న ముగ్గురు విద్యార్థినులు ఇ మహాలక్ష్మి, కే జ్యోతి, సీ శైలజను హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. మహాలక్ష్మి, జ్యోతి కోలుకున్నారు. కానీ శైలజ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. ఊపిరితిత్తుల సమస్యతో పాటు శరీరంలో క్రియాటినిన్ స్థాయిలు పెరిగి మూత్రపిండాల సమస్య తలెత్తింది. దీంతో ఈ నెల 5న బాలికను ఐసీయూలోకి తరలించారు. బాలికకు పలుసార్లు డయాలిసిస్ చేశారు. ఈ నెల 11న ఊపిరితిత్తుల సమస్య తీవ్రమైంది. పరిస్థితి విషమించడంతో శైలజకు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తూ డయాలసిస్ సైతం కొనసాగిస్తున్నారు.

సురేఖపై కేటీఆర్ కేసు విచారణ నేడే

నాంపల్లి కోర్టులు, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసుపై నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు శనివారం విచారణ జరుపనున్నది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్‌తోపాటు సాక్షులుగా ఉన్న తుల ఉమ, బాల్క సుమన్, దాసోజు శ్రవణ్, సత్యవతి రాథోడ్‌ల వాంగ్మూలాలను నమోదు చేసిన కోర్టు.. కేటీఆర్ పిటిషన్‌పై మంత్రి సురేఖ వివరణను కోరనున్నది. ఆమె కౌంటర్‌పై ఇరు వర్గాల వాదనలు పూర్తయ్యాక కోర్టు తన తీర్పును వెల్లడించనున్నది. మంత్రి సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు తీర్పు ఈ నెల 28కి వాయిదా పడిన తెలిసిందే.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

నారాయణపేట రూరల్, నవంబర్ 22 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లాలో చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం మేరకు.. అభంగాపూర్‌కు చెందిన రైతు మేకం భీమప్ప (33) తనకున్న రెండెకరాల్లో వేరుశనగ సాగు చేశాడు. శుక్రవారం పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్–మాస్‌లైన్) డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అస్త్రసన్యాసం.. దేనికి సంకేతం?

> మొదటిపేజీ తరువాయి...

వరకు ఉండాలి. కానీ ఇప్పుడు ఐదెకరాలే మిగిలింది. మిగిలిన 10–11 ఎకరాలు ఆక్రమణకు గురైంది. అందులో చాలా బస్తీలు వచ్చినయి. వాటిని తొలగిస్తామని మేం అనడం లేదు కదా. వాటిని టచ్ చేయం. ఎప్పటినుంచో ఉన్న సమస్యకు ఇప్పుడు ఒకేరోజు పరిష్కారం వస్తుందని ఆశించడం కూడా కరెక్టు కాదు. అందుకే ఇక ముందు సమస్య రాకుండా చూస్తాం..' ఇదీ.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం మీడియా సమావేశంలో చేసిన ప్రకటన.

మారిన వైఖరి దేనికి సంకేతం

నోటీసులిస్తే కోర్టుకు వెళతారు.. అందుకే నోటీసులివ్వకుండానే కూల్చివేస్తాం అన్న హెచ్చరికల నుంచి అనుమతులు లేని నిర్మాణాల జోలికి సైతం వెళ్లమనే ప్రకటన దేనికి సంకేతమన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జంట జలాశయాల్లో భాగమైన హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌ను పునః పరిశీలించి..ఆక్రమణలను నిర్ధారించే ప్రక్రియ శనివారం ఉదయం ప్రారంభం కావాల్సి ఉన్నది. ఈ తరుణంలో కమిషనర్ హైడ్రా రంగనాథ్ చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. చెరువులను చెరబడితే చెరసాలనే!! అని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి పలు సమావేశాల్లో ప్రకటించిన నేపథ్యంలో.. జంట జలాశయాల పరిధిలోని పెద్దల ఫాంహౌస్‌లపై హైడ్రా,

హైడ్రా కమిషనర్ రంగనాథ్

రేవంత్ సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నదనే ఆసక్తి ఇప్పటికీ సామాన్యుల్లో ఉంది. ముఖ్యంగా గత ఐదు నెలల్లో సుమారు 4.65 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా.. ఒక్క రాజకీయ, లేక అధికార పార్టీ ప్రముఖుడి అక్రమ నిర్మాణాన్ని తాకలేదు. ఇప్పుడు యూటర్న్ వెనుక మర్మమేమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికి 4.65 లక్షల చదరపు అడుగుల్లో కూల్చివేతలు

హైడ్రా ఇప్పటివరకు అనేక ప్రాంతాల్లో అనేక నిర్మాణాలను కూల్చివేసింది. సున్నం చెరువు, కత్వా చెరువు, నల్లచెరువు, అప్పా చెరువు, ఎర్రగుంట చెరువు, అమీన్‌పూర్ చెరువు, తుమ్మిడికుంట ఇలా పలు చెరువులతోపాటు గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయంటూ చిలుకూరు, హిమాయత్‌నగర్, అప్పోజిగూడ ప్రాంతాల్లో వందల నిర్మాణాలను నేలమట్టం చేసింది. ఇందులో ఒకటీ, రెండు మినహాయిస్తే మిగిలినవన్నీ సామాన్యుల నివాసాలే. వీటిల్లో అనేకం గతంలో ప్రభుత్వ శాఖలు అనుమతులు ఇచ్చినవి కూడా ఉన్నాయి. మొత్తంగా ఇప్పటివరకు హైడ్రా కూల్చివేసిన నిర్మాణాల పరిమాణాన్ని లెక్కిస్తే దాదాపు 4.65 లక్షల చదరపు అడుగుల వరకు ఉంటుందని సమాచారం. ప్రస్తుతం మార్కెట్లో చదరపు అడుగు నిర్మాణానికి రూ.2వేల వరకు ఖర్చు అవుతుందనుకుంటే.. హైడ్రా కూల్చివేసిన నిర్మాణాల విలువ రూ.100 కోట్ల పైమాటే! ఈ లెక్కింపు కాస్త విడ్డూరంగానే ఉండొచ్చుగానీ... పైసా పైసా కూడబెట్టుకొని, బ్యాంకు రుణాలు తీసుకొని, సొంత ఊర్లో వ్యవసాయ భూములు అమ్ముకొని ఆ వచ్చిన డబ్బులతో నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేసినప్పుడు ఆ సామాన్యుడు అనుభవించిన వ్యథ ఈ వ్యయం ముందు దిగుదుడుపే. బుల్డోజర్లతో కూల్చివేసిన నిర్మాణాలకు ఆ యజమానులు నష్టపరిహారం అడిగే హక్కు ఉందనే హైకోర్టు అమూల్యమైన భరోసా బాధతుల్లో ఆశలు రేకెత్తించవచ్చు. కానీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాన్యుడు ఆ భరోసాను సాకారం చేసుకోవడమనేది ఎంత 'వ్యయ'ప్రయాసలతో కూడుకున్నదో ఊహించవచ్చు.

సాంత్వన సరే.. వేదన మాటేమిటి?!

హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం చెరువుల పరిరక్షణపై నిర్వహించిన సదస్సులో చేసిన వ్యాఖ్యలు లక్షల మంది గృహ యజమానులకు సాంత్వన చేకూర్చేలా ఉంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే ఐదు నెలలుగా బుల్డోజర్లతో తరిమి.. ఇప్పుడు సాంత్వన చేకూర్చే వ్యాఖ్యలు చేస్తే మరి గత ఐదు నెలలుగా వాళ్లు అనుభవించిన మనోవేదన మాటేమిటి? ముఖ్యంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్.. 'ఎప్పటినుంచో వస్తున్న సమస్యకు ఒకేరోజు పరిష్కారాన్ని ఆశించడం కరెక్టు కాదు' అని వ్యాఖ్యానించారు. సరిగ్గా ఐదు నెలల క్రితం హైడ్రా బుల్డోజర్లు దూకుడు ప్రదర్శించిన సమయంలో బీఆర్‌ఎస్‌తో పాటు 'నమస్తే తెలంగాణ' కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. దశాబ్దాలుగా వెలిసిన నిర్మాణాలకు ఇప్పటికిప్పుడు బుల్డోజర్ న్యాయాన్ని అమలు చేయడం సరికాదని స్పష్టం చేసింది. అయినప్పటికీ వందల నిర్మాణాలను కూల్చివేసి, వందల కుటుంబాల్లో వేదన మిగిల్చారు.

ఫాంహౌస్‌ల చుట్టూ రక్షణ వలయమేనా?!

శనివారం ఉదయం సుమారు పది గంటల సమయంలో హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పునః పరిశీలన, నిర్ధారణ ప్రక్రియ మొదలు కానున్నట్టు తెలిసింది. ఈ మేరకు నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. వాస్తవానికి ఈ సంయుక్త సర్వేకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూడా రావాల్సి ఉన్నప్పటికీ ఇతర షెడ్యూల్ దరిమిలా రావడంలేదని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ తర్వాత ఉస్మాన్‌సాగర్ (గండిపేట) పరిధిలో కూడా ఎఫ్‌టీఎల్ పునఃపరిశీలన, నిర్ధారణ ప్రక్రియ చేపట్టనున్నారు. అయితే హైడ్రా కూల్చివేతలు... పదేపదే సీఎం రేవంత్‌రెడ్డి జంట జలాశయాల పరిధుల్లోని ఫాంహౌస్‌లపై చేసిన వ్యాఖ్యలతో పలువురు రాజకీయ ప్రముఖుల నిర్మాణాలు తెరపైకి వచ్చాయి. వాటిలో ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుల గృహాలు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్, అధికార పార్టీ ఎంపీ భాగస్వామ్యం ఉన్న విద్యా సంస్థ నిర్మాణ సముదాయాలు, కాంగ్రెస్ సీనియర్ నేతలు పల్లంరాజు, కేవీపీతో పాటు ఇతర రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖుల ఫాంహౌస్‌ల అంశం చర్చల్లోకి వచ్చింది. వీరిలో కొందరు తమది ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉంటే కూల్చేసుకోండి! అని కూడా ప్రకటనలు చేశారు. తీరా.. జలమండలి సర్వే నివేదికలోనే వీరి పేర్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలను కూల్చివేయబోమని ప్రకటించడంతో ఈ ప్రముఖుల ఫాంహౌస్‌లకు ఇక ప్రమాదేమీ లేదనే స్పష్టమైన సంకేతాలు వచ్చాయి. పేదోళ్లకు ఒక నీతి, పెద్దోళ్లకు ఒక రీతి! అనే సందేహం అందరిలోనూ ఉంది. 'ఇప్పటివరకు హైడ్రా సామాన్యుల నిర్మాణాలను మాత్రమే కూల్చింది. హైరైజ్ బిల్డింగ్స్ (ఆకాశహర్మ్యాలు) జోలికి మాత్రం ఎందుకు వెళ్లలేదు?' అంటూ ఒక రిటైర్డ్ ఇంజినీర్ రంగనాథ్‌ను సూటిగా ప్రశ్నించడమే ఇందుకు నిదర్శనం.

పదేండ్ల రుణఫలం ప్రాజెక్టులు

- మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, సచివాలయం, కలెక్టరేట్ల రూపంలో సాక్షాత్కారం
- 3,85,340 కోట్లతో అనేక అభివృద్ధి పనులు
- కాంగ్రెస్ తెచ్చిన 77,118 కోట్ల అప్పుతో ప్రాజెక్టుల్లో ఒక్క ఇటుకనూ పేర్చలేదు?

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఆర్థిక నిర్వహణ అంటే.. ఆర్థిక వనరులను సమర్థంగా నిర్వహించే ప్రక్రియ. ఆర్థిక లక్ష్యాలను సాధించడం, ఆదాయాన్ని గణనీయంగా పెంచడం, వ్యయాలను తగ్గించడం, ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపర్చడం, ఆర్థిక రిస్క్‌ను తగ్గించడం.. వీటిని పక్కాగా నిర్వహించింది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం. పదేండ్ల పాలనలో ఆదాయ, వ్యయాలను అంచనా వేసింది. అవసరమైన శాఖలకు నిధులు కేటాయించి, ఆర్థిక లక్ష్యాలను సాధించింది. తలసరి ఆదాయాన్ని జాతీయ సగటును మించి పెంచింది. మిషన్ భగీరథ పథకం కింద పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించింది. మిషన్ కాకతీయ పథకంతో చెరువులను బాగుచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తాగు, సాగునీరు అందించి ఉత్తర తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసింది. సచివాలయం, కలెక్టరేట్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి భవనాలు నిర్మించింది. కొవిడ్ కష్టకాలాన్ని సైతం అధిగమించి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. ఈ క్రమంలో తొమ్మిదిన్నరేండ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం రూ.3,85,340 కోట్ల అప్పులు చేయాల్సి వచ్చింది. పదేండ్లలో చేసిన రుణఫలానికి అనేక గొప్ప ప్రాజెక్టులు, భవనాలు కండ్లముందు కనిపిస్తున్నాయి.

ఏడాదిలోపే రేవంత్ 77,118 కోట్ల అప్పు

రేవంత్‌రెడ్డి సర్కారు ఏడాది పాలన ముగియకముందే రూ.77,118 కోట్ల రుణభారాన్ని తెలంగాణ ప్రజలపై మోపింది. గత ఏడాది డిసెంబర్ 7న అధికారం చేపట్టిన నాటి నుంచి ఈ నెల 12 వరకు అంటే 341 రోజుల్లో రేవంత్‌రెడ్డి సర్కారు రూ.77,118 కోట్ల అప్పులు చేసింది. తెలంగాణ జనాభా సుమారు 4 కోట్లు కాగా, ఒక్కో బిడ్డ తలపై రూ.19,279 అప్పుల భారాన్ని కాంగ్రెస్ సర్కారు పెట్టింది. రేవంత్ సర్కారు ఒక్క రోజుకు రూ.226 కోట్లు, వారానికి రూ.1,562 కోట్లు, నెలకు రూ.6,780 కోట్ల రుణాలు సేకరిస్తున్నది. ఒక్క ఆర్బీఐ నుంచే 52,118 కోట్ల అప్పులు చేసిన రేవంత్ సర్కారు.. ఆ రుణాలు సరిపోక వివిధ కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు రూ.25 వేల కోట్ల మేర గ్యారెంటీలు ఇచ్చింది. ఏడాది పాలన పూర్తికాకముందే రూ.77,1188 కోట్ల అప్పు చేసిన కాంగ్రెస్ సర్కారు.. ఏడాదికి సుమారు రూ.1 లక్ష కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.5 లక్షల కోట్ల రుణం సమీకరించే అవకాశం ఉన్నట్టు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు తీసుకున్న రూ.77,118 కోట్ల అప్పుతో రాష్ట్రంలో ఒక కొత్త ప్రాజెక్టు కట్టింది లేదు.. ఒక్క ఇటుకనూ పేర్చింది లేదు.. అని నిపుణులు విస్మయం వ్యక్తంచేశారు. ఒక్క కొత్త పథకం కూడా ప్రవేశపెట్టలేదని వాపోతున్నారు. కేసీఆర్ సర్కారు ఏడాదికి రెండుసార్లు రైతుబంధు ఇవ్వగా, రేవంత్ సర్కారు వానకాలం రైతుబంధు ఇప్పటికీ ఇవ్వలేదని గుర్తుచేస్తున్నారు.

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం సీతానగర్‌లో జాతీయ రహదారి–161పై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

తరుగు పేరిట దోపిడీపై రైతుల ఆందోళన

- సీతానగర్‌లో జాతీయ రహదారిపై బైఠాయింపు
- అధికారులు, రైస్‌మిల్లర్ల తీరుపై మండిపాటు

అల్లాదుర్గం, నవంబర్ 22 : తరుగు పేరిట రైస్‌మిల్లర్లు, అధికారులు కలిసి తమను దోపిడీ చేస్తున్నారని మెదక్ జిల్లాలో రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం అల్లాదుర్గం మండలం సీతానగర్‌లో హైదరాబాద్–నాందేడ్ జాతీయ రహదారిపై బైఠాయించారు. స్థానిక ఉమా వేంకటేశ్వర రైస్ మిల్ యాజమాన్యం అడ్డగోలుగా బస్తాకు 5 కిలోల తరుగు తీస్తున్నదని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ సీతానగర్‌కు చెందిన రైతులు రోడ్డుకు అడ్డుగా ట్రాక్టర్లను నిలిపి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నిబంధనల మేరకు తేమ శాతం ఉన్నా సీతానగర్ ఐకేపీ సెంటర్‌లో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ అధికంగా మరో కిలో వరకు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో ఐదు కిలోల వరకు తాము నష్టపోవాల్సి వస్తున్నదని, అధికారులు, మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కై తమను దోపిడీ చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేసి నిరసన దిగాల్సి వచ్చిందని అన్నారు. రైతుల ధర్నాతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు గంటసేపు అంతరాయం ఏర్పడింది. సీఐ రేణుక, ఎస్సై ప్రవీణ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని రైతులను ధర్నా విరమించాలని కోరినా భీష్మించుకుని కూర్చున్నారు. ఆర్‌ఐ శరణప్ప, ఏపీఎం నాగరాజు.. రైతులు, రైస్ మిల్లర్లతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

010 పద్దు ద్వారా వేతనాలివ్వండి: టీఎంఎస్‌టీఏ

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): మాడల్ స్కూల్స్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలని తెలంగాణ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(టీఎంఎస్‌టీఏ) ప్రభుత్వాన్ని కోరింది. శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, అసోసియేట్ అధ్యక్షుడు సిలువేరు స్వామి సచివాలయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

దశలవారీగా ఆందోళనలు: పీఎంటీఏ టీఎస్

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : మాడల్ స్కూల్ టీచర్ల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళనలకు దిగుతామని ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరించాయి. పీఎంటీఏటీఎస్ సంఘం నేతలు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను శుక్రవారం కలిసి నోటీసు అందజేశారు. మాడల్ స్కూళ్లను పాఠశాల విద్యలో విలీనంచేయాలని, పదోన్నతులు కల్పించాలని పీఎంటీఏ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, ప్రధాన కార్యదర్శి పోచయ్య నోటీసును అందజేశారు.

భారతీయుల దీర్ఘాయువుకు

ఈ జన్యువులే కారణం

మ్యాప్‌మైజీనోమ్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్: ఎక్కువకాలం జీవిస్తున్న భారతీయుల దీర్ఘాయుష్షుకు తోడ్పడుతున్న జన్యువుల గుట్టు విప్పారు హైదరాబాద్‌లోని మ్యాప్‌మైజీనోమ్ సంస్థకు చెందిన పరిశోధకులు. డీఎన్‌ఏ పరీక్షలకు ప్రాచుర్యం పొందిన ఈ సంస్థ దీర్ఘాయుష్షు కలిగిన భారతీయుల్లోని జన్యువులపై ఒక అధ్యయనం చేసింది. ఈ వివరాలు 'ఎన్‌పీజే ఏజింగ్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 85 ఏండ్లు, ఆపై వయసు కలిగిన భారతీయుల జన్యుపరమైన సమాచారాన్ని పరిశోధకులు విశ్లేషించారు. ఎంవైహెచ్6, ఈఎస్‌ఆర్1, ఆర్ఐఎంఎస్1–కేసీఎన్‌క్యూ5, హెచ్‌ఎస్‌పీఏ5 అనే జన్యువులు దీర్ఘాయుష్షు కలిగిన వారిలో ఎక్కువగా ఉన్నట్టు తేలింది. దీర్ఘాయుష్షుకు కారణమయ్యే జన్యువులను అర్థం చేసుకోవడానికి ఈ అధ్యయనం కీలక అడుగు అని సంస్థ సీఈఓ అనురాధ ఆచార్య తెలిపారు.

రాజకీయాలు ఎలా మారతాయో చెప్పలేం

కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర

బెంగళూరు, నవంబర్ 22: కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ మనుగడపై ఆ రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర సంచలన వ్యాఖ్యలు చేశారు. ముందు ముందు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేమని ఆయన అన్నారు. వీలైనంత తొందరగా కాంగ్రెస్ భవన్ నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుందని అన్నారు. శుక్రవారం మైసూరులో జరిగిన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి సరైన భవనం లేదన్న సంగతి సీఎం సిద్ధరామయ్య ఆలస్యంగా గుర్తించినప్పటికీ, భవన నిర్మాణం చేపట్టాలని ఆయన ఆలోచిస్తున్నారని చెప్పారు. 'పార్టీ కోసం భవనాన్ని నిర్మించాలన్నది మంచి ఆలోచన. వీలైనంత తొందరగా నిర్మాణ పనులు చేపట్టాలి. ఎందుకంటే ముందు ముందు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఎలా మారుతాయో చెప్పలేం' అని పరమేశ్వర అన్నారు.

యూఎస్‌లో హైదరాబాద్ విద్యార్థి మృతి

ప్రమాదవశాత్తు తుపాకీ పేలడంతో విషాదం

అమెరికా: హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఆర్యన్ రెడ్డి(23) అమెరికా జార్జియాలోని అట్లాంటాలో ప్రమాదవశాత్తు సొంత తుపాకీ పేలి మృతి చెందాడు. ఈ నెల 13న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కెన్నాస్ స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ రెండో ఏడాది చదువుతున్న ఆర్యన్ రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా మిత్రులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. ఆ తర్వాత ఆర్యన్ గదికి వెళ్లాడు. కాసేపటికి గది నుంచి తుపాకీ పేలిన శబ్దం రావడంతో మిత్రులంతా వెళ్లి చూడగా రక్తపుమడుగులో ఆర్యన్ కుప్పకూలి ఉన్నాడు. సమీపంలోని దవాఖానకు తరలించగా అతడు మరణించినట్టు వైద్యులు ధృవీకరించారు.

25 కేసుల్లో శిక్షలు: డీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : సెప్టెంబర్‌లో ఉమెన్ సేఫ్టీ వింగ్‌లోని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో పిల్లల అక్రమ రవాణాకి పాల్పడిన వారిపై పెట్టిన 25 కేసుల్లో శిక్షలు పడ్డట్టు డీజీ శిఖాగోయెల్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇది మార్చి రికార్డును అధిగమించినట్టు చెప్పారు. ఈ కేసుల ద్వారా నిందితులకు రూ.1,64,000 జరిమానాతో పాటు 5 రోజుల నుంచి 4 నెలల వరకు సాధారణ జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు. నార్సింగి పీఎస్ పరిధిలోని 7 కేసులు, అత్తాపూర్‌లో 6, మైలార్‌దేవ్‌పల్లిలో 4, బాలానగర్‌లో 3, మియాపూర్‌లో 3, శంషాబాద్, కేపీహెచ్‌బీ పీఎస్‌ల పరిధిలో ఒక్కో కేసు నమోదైనట్టు చెప్పారు.